మార్పు కోసం ...

# మరో ఉదయం

TELUGU DAILY & NEWS CHANNEL



ప్రచురణ: అనంతపురం సంపుటి:13 సంచిక : 208 ఆదివారం 21.01.2024 పేజీలు 4 వెల 2.00 సర్క్యులేటెడ్ బై . విజయవాడ. అనంతపురం. కర్నూలు. కడప. సత్యసాయి. అన్నమయ్య రాయచోటి. చిత్తూరు. తిరుపతి. నంద్యాల.

## రాష్ట్రంలో కొనసాగిన ఆలయాల పరిశుభ్రత



### హనుమాన్ ఆలయంలో తమిళసై శుభ్రత

**హైదరాబాద్,జనవరి20 (మరో ఉదయం):**

అయోధ్య ప్రతిష్టాపన దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రధాని మోడీ ఇచ్చిన పిలుపు మేరకు రాష్ట్రంలో ఆలయాల శుభ్రత కొనసాగుతోంది. ఇప్పటికే బిజెపి నేతలు ఆలయాలను శుభ్రం చేశారు. తాజాగా గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ , కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సతీమణిలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. గవర్నర్ తమిళసై ఖైరతాబాద్‌లోని హనుమాన్ ఆలయాన్ని సందర్శించి,ఆలయ ప్రాంగణాన్ని శుభ్రం చేశారు. అనంతరం లక్ష్మణ సమేత సీతారాములను దర్శించుకున్నారు. నవగ్రహ ప్రదక్షిణ చేశారు. అలాగే పాతబస్తీ భాగ్యలక్ష్మి ఆలయాన్ని కిషన్ రెడ్డి సతీమణి శుభ్రం చేశారు. చీపురుపట్టి ఆమె ఊడ్చారు. మోడీ వల్లనే ఇవాళ అయోధ్య ఆలయం సాకారం అయ్యిందని అన్నారు. ఈ నెల 22న అయోధ్య రామ మందిర ప్రారంభోత్సవం నేపథ్యంలో దేశంలో ఉన్న అన్ని ఆలయాను శుభ్రం చేయాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో హనుమాన్ ఆలయంలో స్వచ్ఛ అభియాన్ చేపట్టారు. అయోధ్యలో శ్రీరామమందిరం ప్రాణ ప్రతిష్ట సందర్భంగా దేశవ్యాప్తంగా ఉన్న ఆలయాలను శుభ్రం చేయాలని దేశ ప్రజలను ప్రధాని మోదీ అభ్యర్థించారు. జనవరి 22 నాటికి దేశంలోని అన్ని పుణ్యక్షేత్రాలు, దేవాలయాలను శుభ్రం చేయాలని, స్వచ్ఛతా ప్రచారాన్ని నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా ఈ నెల 12న మహారాష్ట్రలోని నాసిక్‌లో పర్యటించిన ప్రధాని.. శ్రీ కాలారామ్ ఆలయాన్ని శుభ్రం చేసిన విషయం తెలిసిందే.

## గిరిజనలు విద్యకు మోకాలడ్డిన జగన్


**అనకు కాఫీని పరిచయం చేస్తే..**

**జగన్ గంజాయిని పరచియం చేశారు**

**గిరిజనులకు ఉద్దేశించిన 16 పథకాల రద్దు**

**రవాణా వ్యవస్థను పట్టించుకోని సిఎం**

**అరకు సభలో జగన్‌పై చంద్రబాబు విమర్శలు**



చంద్రబాబు.

**విశాఖపట్నం,జనవరి20(మరో ఉదయం):**

ఎంతో ప్రత్యేకత కలిగిన అరకు కాఫీని ప్రపంచానికి తాను పరిచయం చేసానని, అయితే ప్రస్తుత సిఎం మాత్రం గంజాయిని పరిచయం చేశారని టిడిపి అధినేత, ఏపీ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఎద్దేవా చేశారు. దావోస్‌కు ఇప్పటికే అరకు కాఫీ రుచి చూపించామన్నారు. అల్లూరి జిల్లా అరకులో నిర్వహించిన 'రా.. కదలి రా' బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. తెదేపా అరకు కాఫీని ప్రమోట్ చేస్తే.. వైకాపా గంజాయిని ప్రోత్సహిందని విమర్శించారు. తనుకు బాగా ఇష్టమైన ప్రాంతం అరకు అని చంద్రబాబు చెప్పుకొచ్చారు. ప్రకృతి రమణీయతకు, ప్రశాంతతకు నిలయం అరకు అని, ఇక్కడ పండించే పంటలకు గిట్టుబాటు ధర రావడం లేదన్నారు. 'అరకు కాఫీ' అనే పేరును తానే పెట్టానని చంద్రబాబు అన్నారు. అరకు కాఫీని ప్రపంచానికి పరిచయం చేశామన్నారు. టీడీపీ కాఫీని పరిచయం చేస్తే.. వైసీపీ గంజాయిని పరిచయం చేసిందని ఫైర్ అయ్యారు. గిరిజనుల పొట్టకొట్టే ప్రభుత్వం వైకాపా. నమ్మించి గొంతు కోసిన వ్యక్తి జగన్. గిరిజన ప్రాంతాల్లోని ఉద్యోగాలు స్థానికులకే ఇవ్వాలని సంకల్పించా. నేను గతంలో ఇచ్చిన జీవో నెంబర్ 3ని ఎందుకు రద్దు చేశారో వైకాపా చెప్పాలన్నారు. జగన్ పని అయిపోయిందని, జనసేన, టిడిపిలు కలసి ఈ ప్రభుత్వాన్ని సాగనంపుతున్నాయని అన్నారు. తమ భవిష్యత్ కోసం గిరిజనలు టిడిపికి ఓటేసి గెలిపించాలన్నారు. సామాజిక న్యాయం చేస్తానని సీఎం గొప్పలు చెబుతున్నారు. జీవో నెంబర్ 3 రద్దు చేయడం సామాజిక న్యాయమా? మళ్లీ తెదేపా అధికారంలోకి రాగానే దానిని పునరుద్ధరిస్తాం. గిరిజనుల కోసం మేం 16 పథకాలు ప్రత్యేకంగా తీసుకొచ్చాం. వాటిని ఎందుకు రద్దు చేశారో జగన్ చెప్పాలన్నారు. గిరిజనుల పిల్లలు చదువుకోవడం ఆయనకు ఇష్టం లేదు. అందుకే ఎన్టీఆర్ విద్యోన్నతి పథకం రద్దు చేశారు. ప్రపంచంలో ఎక్కడ చదివినా గిరిజనులకు స్కాలర్‌షిప్పులు ఇస్తే.. దాన్నీ తీసేశారు. నైపుణ్యం కోసం శిక్షణ కేంద్రాలు పెడితే వాటినీ ఊడగొట్టారు. గిరిపుత్రిక కల్యాణ పథకాన్నీ రద్దు చేశారు. గిరిజనులకు 50 ఏళ్లకే పింఛన్ ఇచ్చిన ఘనత తెదేపాది. గిరిజనుల సహజ సంపదను దోచుకునే వ్యక్తి జగన్ అని చంద్రబాబు మండిపడ్డారు. గిరిజన ప్రాంతంలో ఎక్కడైనా రహదారి వేశారా? సకాలంలో వైద్యం అందకపోవడంతో చిట్టంపాడుకు చెందిన గర్భిణి చనిపోయారు. మృతదేహాన్ని ఇంటికి తీసుకుపోవాలంటే అంబులెన్స్ పంపలేదు. స్కూటర్‌పై ఎక్కించుకొని ఇంటికి తీసుకుపోవాల్సిన పరిస్థితి. ఆయన నొక్కే బటన్ ఒకటి.. బొక్కే బటన్ ఒకటి. జగన్ దోచేది ఎక్కువ.. జనాలకు ఇచ్చేది తక్కువ. విద్యుత్ ఛార్జీలు ఐదు రెట్లు పెంచేశారని చంద్రబాబు విమర్శించారు. ముఖ్యమంత్రిగా జగన్ రెడ్డి ఒక్క మంచిపని అయినా చేశాడా అని చంద్రబాబు ప్రశ్నించారు. బటన్ నొక్కడం తప్ప గిరిజనులకు చేసిందేమీ లేదని విమర్శించారు. నమ్మించి మోసం చేసే వ్యక్తి జగన్ అని అన్నారు. అడ్డగోలుగా ధరలు పెంచి ప్రజలను దోచుకుంటున్నారని ఆరోపించారు. గిరిజనుల కోసం తాము 16 పథకాలు ప్రత్యేకంగా పెట్టామని.. ఐదేళ్ల పాలనలో 16 గిరిజన పథకాలను రద్దు చేసిన వ్యక్తి జగన్ అని ఫైర్ అయ్యారు చంద్రబాబు. ఈ 16 పథకాలను ఎందుకు రద్దు చేశారో జగన్ చెప్పాలని డిమాండ్ చేశారు గిరిజనుల పిల్లలు చదువుకోవడం జగన్‌కు ఏమాత్రం ఇష్టం లేదని, అందుకే గిరిజనులకు స్కాలర్‌షిప్‌లు ఇస్తుంటే దాన్ని కూడా తీసేశారని ఆరోపించారు చంద్రబాబు. నైపుణ్యం కోసం ఏర్పాటు చేసిన శిక్షణాకేంద్రాలను సైతం జగన్ తీసేశారని విమర్శించారు చంద్రబాబు. గిరిపుత్రిక కల్యాణపథకం తీసుకొస్తే.. దాన్నీ రద్దు చేశారన్నారు. గిరిజనులకు 50 ఏళ్లకే పింఛన్ ఇచ్చిన ఘనత టీడీపీది అని పేర్కొన్నారు. గిరిజనుల సహజ సంపద దోచుకునే వ్యక్తి జగన్ అని విమర్శించారు.పోలవరం ప్రాంతాలన్నింటిని కలిపి కొత్త జిల్లాను ఏర్పాటు చేస్తామని ఈ సందర్భంగా చంద్రబాబు ప్రకటించారు. పోలవరం జాతీయ పథకమని, ఐదేళ్లలో దానిని పూర్తి చేయలేక పోయారని మండిపడ్డారు.

## మయన్మార్ లో సైన్యానికి, తిరుగుబాటు దళాలకు భీకర పోరు

**ప్రాణభయంతో భారత్ లోకి వస్తున్న మయన్మార్ సైనికులు... అమిత్ షా స్పందన**

**సరిహద్దులు దాటి మిజోరంలోకి ప్రవేశించిన మయన్మార్ సైనికులు**

**సరిహద్దు రాకపోకలను కట్టడి చేస్తామన్న అమిత్ షా**



అసోంలో కొత్తగా ఏర్పాటు చేసిన ఐదు పోలీస్ కమాండో బెటాలియన్ల శిక్షణ పూర్తయిన సందర్భంగా ఏర్పాటు చేసిన పాసింగ్ అవుట్ పరేడ్ కార్యక్రమంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. మయన్మార్ నుంచి సరిహద్దులు దాటి దేశంలోకి ప్రవేశిస్తున్న వారిని అడ్డుకుంటామని తెలిపారు. మయన్మార్ పౌరులు భారత్ లోకి యధేచ్ఛగా రాకపోకలు సాగించడంపై కేంద్రం పునరాలోచిస్తోందని వివరించారు. బంగ్లాదేశ్ తో సరిహద్దు విషయంలో ఎలా వ్యవహరిస్తున్నామో, మయన్మార్ సరిహద్దు వద్ద కూడా భద్రత ఏర్పాటు చేస్తామని చెప్పారు. మయన్మార్ లో ప్రస్తుతం అంతర్యుద్ధం జరుగుతోంది. సైన్యానికి, తిరుగుబాటు దళాలకు మధ్య భీకరపోరు కొనసాగుతోంది. మయన్మార్ సైనికులు ప్రాణాలు కాపాడుకునేందుకు సరిహద్దులు దాటి భారత్ లో ప్రవేశిస్తున్నారు. తాజాగా, 600 మంది మయన్మార్ సైనికులు సరిహద్దు రాష్ట్రం మిజోరంలోకి వచ్చారు. ఆశ్రయం కోసం మయన్మార్ సైనికులు వస్తున్న నేపథ్యంలోనే, కేంద్ర హోంమంత్రి అమిత్ షా పై వ్యాఖ్యలు చేశారు.

## జగన్ నియంతపాలనలో అంగన్వాడీ చెల్లెమ్మల బలి

**ఏపీలో డిమాండ్ల సాధన కోసం పోరాడుతున్న అంగన్వాడీలు**

**40 రోజులుగా సమ్మె**

**అంగన్వాడీలకు టీడీపీ మద్దతు**

**తాజాగా ప్రకటన విడుదల చేసిన నారా లోకేశ్**




## ఆ సిద్ధాంతాల కోసం ఆఖరి వరకు నిలబడతాను




**ఏపీ కాంగ్రెస్ చీఫ్ గా షర్మిల నియామకం**

**తండ్రి ఆశీస్సుల కోసం ఇడుపులపాయ**

**వచ్చిన వైఎస్సార్ తనయ**

**వైఎస్సార్ ఆశయాలన్నీ సిద్ధించాలన్న షర్మిల**

**రాహుల్ గాంధీని ప్రధాని చేసేవరకు**

**పోరాటం ఆగదని వెల్లడి**

మార్పు కోసం ...
మరో ఉదయం
TELUGU DAILY & NEWS CHANNEL

# సంపాదకీయం

## అయోధ్యపై అపశకునాలకు తావులేదు !

రామో విగ్రహవాన్ ధర్మః..అంటే మూర్తీభవించిన ధర్మస్వరూపుడు రామచంద్రుడు...రామయణం మొత్తం ధర్మపాలన, ధర్మబద్ధత గురించే చెబుతుంది. మనిషి నడవడిక మొదలు..ఎవరు ఎలా నడచుకోవాలో చెబుతుంది. రామయణం రాసిన వాల్మీకి మహర్షి నిజంగా గొప్పవాడు. రాముడు నడయాడిన అయోధ్య ఇప్పుడు పావన అయోధ్యగా మారుతోంది. ముష్కరుల దాడిలో భారీతీయ హైందంవాన్ని దెబ్బతీసినా.. శతాబ్దాలుగా చేస్తున్న పోరాటలకు చరమగీతం పడింది. జగదానంద కారకా..జయ జానకీ ప్రాణ నాయక ..శుభ స్వాగతం..ప్రియా పరిపాలక మంగళకరం నీరాక..మా జీవనమే పావనమవుగాక..అంటూ భక్తకోటి ఆశ్రీరాముడ్ని తలచుకుని పాడుతోంది. భవ్యరామమందిరంలో మన రామయ్య కొలువయ్యేనాటికి ఎన్నో అద్భుతాలు సాత్కారించబోతున్నాయి. ఆ అద్భుత మహాయజ్ఞంలో ప్రతి ఒక్కరి ఘనతా ఉంది. అది ఓ ఆలయానికి సంబంధించిన గట్టం కాదు. మన తరతరాల సంస్కృతికి, వారసత్వ సంపదకు చిహ్నం. దానిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిది. మనమంతా వెలుగుదివ్వెల్లా ముందుకు సాగాల్సిన సమయమిది.

అయోధ్యలో భవ్యమందిర నిర్మాణం జరిగింది. 22న మనమంతా ఎదురు చూస్తున్న మహాక్రతువు ప్రారంభం కానుంది. మన ధర్మాన్ని మనం నిలబెట్టుకుని సగర్వంగా ఆచరించే శుభ ఘడియగా దీనిని భావించాలి. ఇక్కడ తర్కాలకు, విమర్శలకు తావు లేదు. అయోధ్య ముహూర్తం సరైనదా కాదా అన్న వివాదాలకు సమయం కాదిది. ఎవరు ఈ కార్యక్రమాన్ని చేస్తున్నారన్న రాజకీయాలకు వేదిక కాదు. భారీతీయులు.. ప్రపంచవ్యాప్తంగా ఉన్న హైందవులంతా ఒక్కటై పిక్కటిల్లేలా రాముడికి వందనం చేయాల్సిన సమయమిది. ధర్మాన్ని కాపాడుతామని ప్రతిన చేయాల్సి సమయమిది. ఇక్కడ పండిత విమర్శలకు, రాజకీయ కుసంస్కారాలకు ఆస్కారం లేదు. శతాబ్దాల కింద ముష్కరుల దాడిలో ధ్వంసమైన హైందవాన్ని పునరుద్ధరించుకునే సమయం మాత్రమే. దీనికి మీనమేషాలు లెక్కించాల్సిన అవసరం లేదు. నిత్యం మనమంతా ఉదయం కోసం ఎదురు చూస్తాం. ఎదురు చూడాలి. ఈరోజుకంటే రేపు గొప్పది... ఎదురు చూడటంలో నమ్మకం ఉంది. ఆశ ఉంది. మనోబలం ఉంది. శ్రద్ధ ఉంది. ఇష్టం ఉంది. అపారమైన ప్రేమ ఉంది. బతకాలన్న కోరిక మెండుగా ఉంది. వసంతం కోసం కోయిల, కోయిల కోసం వసంతం ఎదురు చూస్తాయి. ఎంతో కష్టపడి తాను పోగుచేసిన తేనెను, మనిషి కోసం తేనెటీగ త్యాగం చేస్తుంది. ఆ సహజత్వంలో అపారమైన ప్రకృతి ప్రేమ ఉంది. కారణజన్ములను కన్న తల్లులు కూడా తొమ్మిది నెలలు తమ గర్భంలో మోసి వారి రాకకోసం ఎదురుచూస్తారు. ఈ 'రోజు' వెళ్లిపోతుంది. 'రేపు' చిరునవ్వులతో మనముందు సాక్షాత్కరిస్తుంది. కొత్త ఆశలు రెక్కలు తొడుక్కుని వస్తాయి. కొత్త చిగుళ్లతో చెట్లు ముస్తాబవుతాయి. కొత్త సూర్యుడు బంగారు పూలరథంమీద వస్తాడు. భవిష్యత్తులో జరగబోయే అద్భుతాల కోసం మనమంతా విధిగా ఎదురుచూడాలి. ఎందుకంటే రామాయణంలో గుహుడు ఎదురుచూశాడు. శబరి అలాగే ఎదురుచూసింది. కౌసల్య ఎదురు చూసింది. దశరథుడు ఎదురుచూశాడు. అయోధ్య ఎదురుచూసింది కూడా శ్రీరాముడి జననం కోసం. అలాగే ఇప్పుడంతా ప్రపంచమంతా అయోధ్య రాముడి ఆలయం కోసం ఎదురు చూస్తోంది. శతాబ్దాల స్వప్నం సాకారం అయ్యే ఘడియలు సమీపిస్తున్నాయి. ప్రపంచంలోని ప్రముఖులంతా హాజరుకాబోతున్న ఈ మహా సంబురం వేళ అయోధ్య సరికొత్తగా తనను తాను ఆవిష్కరించుకుంటోంది. విశ్వ ఆధ్యాత్మిక నగరిగా విరాజిల్లుతున్న అయోధ్యలో ఎక్కడ చూసినా ఆధ్యాత్మిక పరిమళాలతో విరాజిల్లబోతోంది. లక్షలమంది హాజరయ్యే భవ్య రామమందిర మహా సంరంభ వేడుకకు నభూతో నభవిష్యత్ అన్నరీతిలో ఏర్పాట్లు జరిగాయి. ఈ మహాత్కార్యంలో తామూ భాగస్వాములయ్యేందుకు భక్తజనం ఉవ్విళ్లూరుతోంది.

22న రామ్‌లల్లా విగ్రహా ప్రతిష్టాపన..భవ్య కార్యక్రమానికి దివ్య ముహూర్తం నిర్ణయమైంది. ఆ రోజు మధ్యాహ్నం సరిగ్గా 12 గంటల 29 నిమిషాల 8 సెకన్ల నుంచి 12 గంటల 30 నిమిషాల 32 సెకన్ల శుభ ముహుర్తాన విగ్రహా ప్రతిష్టాపన జరగనుంది. అంటే శతాబ్దాల యావత్ హిందువుల కల 84 సెకన్లలో పరిపూర్ణమవుతుంది. మేషలగ్నంలో అభిజిత్ ముహూర్తంలో శ్రీరాముడి ప్రాణప్రతిష్ట కార్యక్రమం జరగ నుంది. ఆ పవిత్ర సమయంలో గురు ఉచ్చస్థితి ఉండవల్ల రాజయోగం కలుగుతుంది. సాధారంగా 5 గ్రహాలు అనుకూలంగా ఉంటే అది అత్యంత శుభముహుర్తంగా పరిగణిస్తారు. రామ్‌లల్లా ప్రాణప్రతిష్ట సమయంలో ఆరు గ్రహాలు అనుకూలంగా ఉండడం మరో విశేషం. భూకంపాలు..సునామీ..ఎలాంటి ప్రళయాలు వచ్చినా సరే..అయోధ్య రీవీ ఇసుమంత కూడా చెక్కు చెదరకుండా అయోధ్య భవ్య రామమందిరం నిర్మాణం సాగింది. ఈ అర్కిటెక్చర్‌ను చూసి ప్రపంచం అబ్బురపడుతోంది. ఇక కొందరిలో మరో శంక కలుగుతోంది. దీనిపైనా రాజకీయాలు నడుస్తున్నాయి. విగ్రహ ప్రతిష్టాపన జరుగకుండానే...పూజలు చేయకుండానే అక్షతలు ఎలా వచ్చాయి అని చాలా మందికి సందేహం కలిగింది. చాలామంది ఇదే వారి సందేహమని అన్నారు. మనకు పంపిణీ చేస్తున్న అక్షింతలు విగ్రహా పూజకి సంబంధించినవి కావు. వాటిని అక్కడి పురోహితులు విజయ 'అక్షతలు'అని వర్ణించారు. 500 సంవత్సరాల పోరాటం తరువాత రాముని ఆలయ నిర్మాణానికి మనకు అవకాశం దక్కింది కనుక, ఆలయ నిర్మాణాన్ని విజయంగా భావించి, నిర్మాణం జరిగిన తరువాత, బాల రాముని సన్నిధిని కలిగిన ఆలయ ప్రాంగణంలో, విజయ అక్షతలను బియ్యమూ,పసుపూ ఆవునెయ్యిలతో వేద మంత్రోచ్చారణ చేస్తూ కలిపి ఇంటింటికీ పంపించాలని సంకల్పించారు. రాముడు వనవాసం తరువాత అయోధ్యకి తిరిగి వస్తుండగా అందరూ అక్షతలూ పూలూ చేతులలో పట్టుకుని ఆయన రాగానే వాటిని చల్లి.. ఆహ్వానం పలికారట. అలాగే మరల అయోధ్య లో రాముని ప్రతిష్ఠ జరిగినప్పుడు ఆ ఆలయంలో ముందుగా తయారైన ఈ 'విజయ అక్షతలు' మనం ఇంట్లో పూజకు వాడి శిరస్సున ధరించా లని ఉద్దేశ్యం. అక్షయమైనవి అక్షింతలు. క్షయము లేనివి, రామ రాజ్యము అక్షయముగా ఉండాలని కోరుతూ మనందరం విగ్రహ ప్రతిష్ఠ రోజున అయోధ్య దగ్గరలో ఉండి అక్షతలు వేయలేకపోయినా ఇంట్లోనే ఉండి ఆలయ ప్రాంగణంలో తయారైన విజయ అక్షతలతో పూజ చేసుకుని వాటిని శిరస్సున ధరించవచ్చు. క్రింద పడితే తొక్కుతామనే సందేహం ఉంటే పూజలో వాడిన అక్షింతలని నైవేద్యం కోసం వాడుకోవచ్చు. ఇకపోతే అయోధ్య రామ మందిర ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో భాగంగా సంప్రోక్షణ ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. గురువారం గర్భగుడి లోపల విగ్రహం ఉంచిన ఫొటోలు విడుదల కాగా.. ఆ విగ్రహం తలపై పసుపు గుడ్డ కప్పి ఉంచారు. ఈ విగ్రహం బాల రాముడి ముఖంతో పాటు బంగారు విల్లు, బాణాన్ని పట్టుకున్నట్లు చూపిస్తోంది. ఐదు ఏళ్ల ప్రాయంలో రామచంద్రుడు బంగారు విల్లు, బాణం పట్టుకుని నిలబడి ఉన్న భంగిమలో దర్శనం ఇస్తున్నాడు. మొత్తంగా మనమంతా అయోధ్య సంకల్పంతో ముందుకు సాగాల్సిన సమయమిది. ధర్మరక్షణకు మనమంతా కట్టుబడి ఉంటామని ప్రతిన చేయాల్సిన తరుణమిది.

మొదటి పేజీ తరువాయి

# జగన్ నియంతపాలనలో అంగన్వాడీ చెల్లెమ్మల బలి

ఏపీలో అంగన్వాడీ కార్యకర్తలు, సహాయక సిబ్బంది 40 రోజులుగా సమ్మె చేస్తున్నారు. ఎన్నికల హామీలను నిలబెట్టుకోవాలని, వేతనాలు పెంచాలన్న డిమాండ్లతో అంగన్వాడీలు సమ్మె బాటపట్టారు. అంగన్వాడీలకు టీడీపీ మద్దతు పలుకుతోంది. ఈ క్రమంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ అంగన్వాడీలను ఉద్దేశించి ఓ ప్రకటన విడుదల చేశారు. జగన్ నియంతపాలనలో అంగన్వాడీ చెల్లెమ్మలు బలి అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే న్యాయమైన డిమాండ్లను పరిష్కరిస్తుందని హామీ ఇచ్చారు. "రాజులు, రాజ్యాలు అంతరించిపోయి ప్రజాస్వామ్యం అమల్లోకి వచ్చాక తొలిసారిగా సుమారు అయిదేళ్ల క్రితం ఏపీ ప్రజలు పొరపాటున జగన్మోహన్ రెడ్డి అనే నయా నియంతకు అధికారమిచ్చారు. ఆయన అనాలోచిత, పిచ్చి నిర్ణయాలతో అన్నివర్గాల ప్రజలను కష్టాలకు గురిచేస్తున్నాడు. ఎన్నికల సమయంలో తమకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలంటూ 40 రోజులుగా అంగన్వాడీలు ఆందోళనలు చేస్తుంటే కనీస స్పందన లేకపోగా, విధుల్లోకి చేరకపోతే ఉద్యోగాలు పీకేస్తామని తన పాలేరు సజ్జలతో బెదిరింపులకు దిగుతున్నాడు. ప్రభుత్వ అనాలోచిత, మొండివైఖరి కారణంగా ఇప్పటికే ఇద్దరు అంగన్వాడీ చెల్లెమ్మల ప్రాణాలు అనంతవాయువుల్లో కలిసిపోయాయి. జగన్ అంగన్వాడీలపై ప్రయోగించిన ఎస్మా ఆయన పాలిట భస్మాసుర హస్తంగా మారబోతోంది. ఎంతటి నియంత అయినా ప్రజాభీష్టానికి తలొగ్గక తప్పదన్న చారిత్రక సత్యాన్ని గుర్తించలేని జగన్... మరో 3 నెలల్లోపే ఇంటికి వెళ్లడం ఖాయం. ఎన్ని ఇబ్బందులు పెట్టినా బెదిరిపోకుండా న్యాయమైన డిమాండ్ల సాధనకు 40 రోజులుగా ఆందోళన చేస్తున్న అంగన్వాడీలకు తెలుగుదేశం పార్టీ సంపూర్ణ మద్దతు తెలియజేస్తోంది. టీడీపీ-జనసేన నేతృత్వంలో రాబోయే ప్రజాప్రభుత్వం అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లను పరిష్కరిస్తుందని నేను మాట ఇస్తున్నాను" అంటూ లోకేశ్ తన ప్రకటనలో పేర్కొన్నారు.

మొదటి పేజీ తరువాయి

# ఆ సిద్ధాంతాల కోసం ఆఖరి వరకు నిలబడతాను

ఏపీ పీసీసీ నూతన చీఫ్ వైఎస్ షర్మిల ఇవాళ ఇడుపులపాయ వచ్చారు. ఇక్కడి ఎస్టేట్ లోని తన తండ్రి దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి సమాధి వద్ద ఆమె నివాళులు అర్పించి ఆశీస్సులు అందుకున్నారు. ఈ సందర్భంగా మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలిగా బాధ్యతలు స్వీకరించబోతున్న సందర్భంగా ఇవాళ ఇడుపులపాయలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి గారి ఆశీస్సులు అందుకోవడానికి వచ్చానని వెల్లడించారు. రాజశేఖర్ రెడ్డి గారికి కాంగ్రెస్ పార్టీ అన్నా, కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు అన్నా ప్రాణంతో సమానం అని తెలిపారు. ఆ సిద్ధాంతాల కోసం రాజశేఖర్ రెడ్డి గారు ఎంతో దూరమైనా వెళ్లేవారని పేర్కొన్నారు. "భారతదేశంలో ఇవాళ లౌకికవాదం అనే పదానికి, బహుజనవాదం అనే పదానికి అసలు అర్థమే లేకుండా పోయింది, రాజ్యాంగానికి అర్థమే లేకుండా పోయింది. ఇలాంటివన్నీ మళ్లీ నెలకొనాలి, కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు నిలబడాలి... భారతదేశానికి మంచి జరగాలి, వైఎస్సార్ ఆశయాలన్నీ సిద్ధించాలని ఆకాంక్షిస్తున్నాం. అందుకే రాజశేఖర్ రెడ్డి బిడ్డ కాంగ్రెస్ పార్టీలో చేరింది. ఆ సిద్ధాంతాల కోసం ఆఖరి వరకు నిలబడతాను. వైఎస్సార్ కోరుకున్నట్టుగా రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేసేంతవరకు... నా పోరాటమే కాదు ఇక్కడ ఏ ఒక్కరి పోరాటం కూడా ఆగదని తెలియజేయడానికి సంతోషిస్తున్నాం" అంటూ షర్మిల ప్రసంగించారు.అనంతరం, మాజీ మంత్రి అహ్మదుల్లాను కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. అహ్మదుల్లాకు షర్మిల కాంగ్రెస్ పార్టీ కండువా కప్పారు. ఈ కార్యక్రమంలో పీసీసీ మాజీ అధ్యక్షులు రఘువీరారెడ్డి, సాకే శైలజానాథ్, పీసీసీ మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ తులసిరెడ్డి, సీనియర్ నేత కేవీపీ రామచంద్రరావు తదితరులు కూడా పాల్గొన్నారు.

# విద్యుత్ సబ్ స్టేషన్ ప్రారంభించిన ఎమ్మెల్యే కేతిరెడ్డి

**యాడికి, జనవరి 20,మరో ఉదయం :**

మండలంలోని నగరూరు లో విద్యుత్ సబ్ స్టేషన్ ను ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి శనివారం ప్రారంభించారు. బ్రాహ్మణుల మంత్రోచ్చారణ మధ్య నూతనంగా నిర్మించిన విద్యుత్ సబ్ స్టేషన్ ను ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు సి ఎం జగన్ రైతుల కోసం అహర్నిషలు కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు.ఈ కార్యక్రమంలో వెంకటరామిరెడ్డి, బాలా రమేష్ బాబు, తలారి నాగేష్ , బ్రహ్మానందారెడ్డి ,నాయకులు,కార్యకర్తలు ,విద్యుత్ ఏఈ రాజారెడ్డి,సిబ్బంది పాల్గొన్నారు.





# గృహ ప్రవేశానికి హాజరైన జెసి అష్మిత్ రెడ్డి

**యాడికి,జనవరి 20,మరో ఉదయం :**

మండల కేంద్రంలో కార్తీ ప్రవీణ్ కుమార్ ఆహ్వానం మేరకు నూతన గృహ ప్రవేశం నకు తాడిపత్రి తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి జెసి అశ్మిత్ రెడ్డి , యాడికి మండల నాయకులు చవ్వా గోపాల్ రెడ్డి శనివారం హాజరైనారు. కార్తీ ప్రవీణ్ కుమార్ కుశుభాకాంక్షలు తెలిపి, అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు గండికోట లక్ష్మణ్, యాడికి మండల టీడీపీ అనుబంధ కమిటీ సభ్యులు బీసీ సెల్ అధ్యక్షుడు తిరంపురం నీలకంఠ, మైనారిటీ అధ్యక్షుడు సుబహాన్, పట్టణ కమిటీ సెక్రటరీ గన్నె రమేష్, తెలుగు యువత ఉపాధ్యక్షుడు నారాయణ స్వామి, పామిసెట్టి గోపి, యల్లపు రమణ, చంద్ర, గుండా నారాయణ స్వామి, రాజు,ఆనందమూర్తి,తిరు,రవి,రాజశేఖర్ రెడ్డి, సుబ్బు, దేవేంద్ర, విశ్వం తదితరులు పాల్గొన్నారు.



# యువ చైతన్య యాత్ర జెసి పి ఆర్ కు మద్దతు తెలిపిన తెదేపా

**యాడికి,జనవరి 20, మరో ఉదయం :**

పెద్దవడుగురు మండలంలో యువ చైతన్య యాత్ర లో మాజీ ఎమ్మెల్యే జెసి ప్రభాకర్ రెడ్డి నిర్వహిస్తున్న కార్యక్రమంలో యాడికి మండల టిడిపి నాయకులు హజరైనారు. గంజికుంటపల్లి, చిట్టుర్ , చిన్న వడగూరు గ్రామాల్లో పాల్గొన్నారు. పెద్దవడుగూరు మండలంలో యువ చైతన్య బస్సు యాత్రకు అనూహ్య స్పందన లభిస్తోందని, ప్రజలు జేసీ ప్రభాకర్ రెడ్డికి నీరాజనాలు పలుకుతున్నారని టిడిపి నాయకులు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో టిడిపి అత్యధిక మెజార్టీ సాధిస్తుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ గొర్తి రుద్రమ నాయుడు, రామచంద్రారెడ్డి, చలమారెడ్డి, నీలకంఠారెడ్డి, బాలచంద్ర, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



# అయోధ్య ప్రాణప్రతిష్టకు సెలవు 22న సెలవు కోసం

# బిజెపి డిమాండ్

**విజయవాడ/హైదరాబాద్,జనవరి20(మరో ఉదయం):**


అయోధ్య ప్రతిష్టాప స రోజుసెలవు కోసం బీజేపీ యుద్ధం ప్రకటించింది. బాల రాముడి విగ్రహ ప్రతిష్ట నాడు మీరెందుకు సెలవు ఇవ్వరూ అంటూ ఏపీ, తెలంగాణ సర్కార్‌లను కాషాయ పార్టీ నిలదీస్తోంది. దేశంలో చాలా రాష్ట్రాలు 22న సెలవు ఇచ్చాయి. ఆ హోలీ డే గురించి మీకు పట్టదా, రాముడంటే లెక్కలేదా అంటోంది కమలం పార్టీ. 22వ తేదీని సెలవు దినంగా ప్రకటించకపోతే సమరమే అంటోంది. ఈసారి తెలుగు రాష్ట్రాల్లో బీజేపీ సెలవుకోసం పోరాటం చేస్తోంది. ఈ నెల 22న అయోధ్యలోని దివ్య భవ్య నవ్య రామ మందిరంలో ప్రాణ ప్రతిష్టతో కొలువుదీరనున్నాడు బాల రామయ్య. దీంతో 22వ తేదీని సెలవు దినంగా ప్రకటించాలని తెలుగు రాష్ట్రాల్లోని వైసీపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలను బీజేపీ డిమాండ్ చేస్తోంది. కొన్ని రాష్ట్రాల్లో సెలవు దినం ఇప్పటికే ప్రకటించారు. ఈ నెల 22న అయోధ్య లోని రామ మందిరంలో బాల రాముడి విగ్రహ ప్రతిష్ట కోసం దేశమంతా ఎదురు చూస్తోంది. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఆ రోజును సెలవు దినంగా ప్రకటించారు. అయితే ఆ హోలీ డే నాడు తెలుగు రాష్ట్రాలు హోలీ డే ప్రకటించవా అంటూ బీజేపీ నేతలు మండిపడుతున్నారు. తెలుగు రాష్ట్రాల్లో 22వ తేదిని సెలవు దినంగా ప్రకటించాలని ఆయా ప్రభుత్వాలను బిజెపి కోరుతోంది. భారతీయుల శతాబ్దాల కల, దశాబ్దాల పోరాటం.. రామమందిర నిర్మాణం రూపంలో సాకారమవుతోందని, బాల రాముడి విగ్రహ ప్రతిష్ట జరుగుతోందని ఏపీ బీజేపీ చీఫ్ పురంధేశ్వరి అన్నారు. అయితే ఏపీ ప్రభుత్వం ఈ నెల 21 వరకే సెలవులు ఇచ్చిందంటూ ఆమె విమర్శించారు. 22న బాలరాముని ప్రతిష్టా కార్యక్రమం కోసం దేశ ప్రజలంతా ఎదురు చూస్తున్నారని, అయితే ఆనాడు సెలవు ఇవ్వకపోవడం వెనుక ఏపీ ప్రభుత్వ దురుద్దేశం ఉందని పురంధేశ్వరి ఆరోపించారు. ఃరామయ్య విగ్రహ ప్రతిష్ట నాడు.. ఏపీ సర్కార్ సెలవు దినం ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు. ఇక తెలంగాణలో కూడా బీజేపీ శాఖ సెలవు కోరుతోంది. అయోధ్య రాముడు అందరివాడని, రామ విగ్రహ ప్రాణ ప్రతిష్ట కార్యక్రమంలో ప్రజలు పాలు పంచుకునేందుకు ఈనెల 22న అధికారికంగా సెలవు ప్రకటించాలని తెలంగాణ సర్కార్‌కు బీజేపీ జాతీయ కార్యదర్శి బండి సంజయ్ విజ్ఞప్తి చేశారు. బీజేపీ విజ్ఞప్తులను ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు ఎంతవరకు పరిగణనలోకి తీసుకుంటాయో చూడాలి.

# రాముడిపై ఎవరి భక్తి వారిదే

## రేగుపండ్లు సమర్పించిన ఛత్తీస్‌ఘడ్ భక్తులు

**అయోధ్య,జనవరి20(మరో ఉదయం):**

అయోధ్య రామ మందిరం రాములోరి ప్రాణప్రతిష్ఠకు సిద్ధమవుతున్నది. ఇప్పటికే బాలరాముడు గర్భగుడిలో కొలువుదీరాడు. బాల రామునికి సంబంధించిన ఫొటోలను ఆయోధ్య తీర్థ క్షేత్ర ట్రస్టు విడుదల చేసింది. దీంతో యావత్ భారతదేశం భక్తిపారవశ్యంలో మునిగిపోతున్నది. ఇక దేశ ప్రజలు రామునిపై తమ భక్తిని వివిధ మార్గాల్లో చాటుకుంటున్నారు. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన 17 మంది భక్తులు అయోధ్యకు చేరుకున్నారు. రాములవారికి నైవేద్యంగా రేగిపండ్లు సమర్పించారు. వాటిని రామ జన్మభూమి ట్రస్టుకు అందించారు. ఛంపా జిల్లాలోని రాములవారి అమ్మమ్మ ఇళ్లుగా చెప్పుకునే శివ్రినారాయణ ప్రాంతం నుంచి రేగిపండ్లను తెచ్చినట్లు అనూప్ యాదవ్ అనే భక్తుడు తెలిపారు. అదేవిధంగా అక్కడ లభించే ప్రత్యేక మొక్కను కూడా తీసుకొచ్చామని వెల్లడించారు. ఆ చెట్టు ఆకులు గిన్నె ఆకారంలో ఉంటాయన్నారు. వనవాసంలో భాగంగా సోదరుడు లక్ష్మణుడితోపాటు శివ్రినారాయణ ప్రాంతానికి వచ్చిన శ్రీరామునికి.. ఆ ఆకుల్లోనే శబరి తాను సంగం తిన్న రేగిపండ్లను ఇచ్చారని ప్రతీతి అన్నారు. అందువల్ల ఈ మొక్కను గుడి ఆవరణలో నాటాలని ఆలయ కమిటీని కోరినట్లు చెప్పారు.



# కాంగ్రెస్ వైపు ఎంఐఎం మొగ్గు ?

## లండన్‌లో సిఎం రేవంత్‌తో అక్బరుద్దీన్ భేటీ

## రాజకీయ చర్చకు దారితీస్తోన్న సమీకరణాలు

హైదరాబాద్,జనవరి20(మరో ఉదయం)



పార్మలెంట్ ఎన్నికలకు ముందు తెలంగాణ రాజకీయాలు మారుతున్నాయి. లండన్ పర్యటనలో ఉన్న సిఎం రేవంత్‌రెడ్డిని ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ కలవడం రాజకీయంగా చర్చకు దారితీస్తోంది. సీఎం రేవంత్ రెడ్డితో అక్బరుద్ధీన్ భేటీ కావడం తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. లండన్ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డిని అక్బరుద్దీన్ కలవడం పట్ల రకరకాల ఊహాగానాలు వినిపిస్తున్నాయి. బొటాబోటీ మెజార్టీ ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడైనా కూలిపోవచ్చంటూ ప్రతిపక్షాలు హెచ్చరిక వ్యాఖ్యలు చేస్తున్న నేపథ్యంలో రేవంత్ రెడ్డిని ఎంఐఎం నేత అక్బరుద్ధిన్ కలవడం సహజంగానే కాంగ్రెస్, ఎంఐఎంలు పరస్పరం కలిసి నడుస్తాయన్న చర్చలను రేకెత్తించింది. ప్రస్తుతం అసెంబ్లీలో 119స్థానాల్లో కాంగ్రెస్‌కు 64, మిత్రపక్షం సీపీఐకి 1 స్థానం, ఎంఐఎంకు 7, బీజేపీకి 8, బీఆరెస్‌కు 39స్థానాలున్నాయి. బీఆరెస్, బీజేపీలు ప్రభుత్వాన్ని పడగొట్టే క్రమంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఎవరైనా చేజారినా రేవంత్ ప్రభుత్వం మైనార్టీలో పడే అవకాశముంది. అలాంటి పరిస్థితుల్లో ఎంఐఎం మద్దతు కీలకంగా మారనుంది. సాధారణంగా మజ్లిస్ వ్యూహం అధికార పార్టీతో ఇచ్చిపుచ్చుకునే ధోరణిలో ఉండటం. కాంగ్రెస్ తోనూ అలాగే ఉంటుంది. అసెంబ్లీలో ప్రజా సమస్యలపై మాట్లాడేటప్పుడు మొహమాటాలు పెట్టుకోరు. ఏ స్థాయిలో అవకాశం వస్తే ఆ స్థాయిలో నిలదీస్తారు. కానీ బయట రాజకీయం మాత్రం భిన్నంగా ఉంటుంది. మజ్లిస్ పాతబస్తీలో తమ బేస్ ను కాపాడుకోవడానికి ప్రయత్నిస్తుంది. అందుకే తెలంగాణ అధికార పార్టీతో సన్నిహితంగా ఉండి.. పాతబస్తీలోకి అడుగు పెట్టకుండా చూసు కుంటుంది. మిగతా తెలంగాణ మొత్తం ఆ పార్టకి మద్దతుగా ఉంటుంది. బీఆర్ఎస్ పార్టీకి అలాగే మద్దతుగా నిలిచింది. కేసీఆర్ మళ్లీ సీఎం అవడానికి చాలా మద్దతు ఇచ్చింది. కానీ కాంగ్రెస్ విజయం సాధించింది. ఇప్పుడు పార్లమెంట్ ఎన్నికలు రానున్నాయి. బీఆర్ఎస్ పాత్ర పరిమితంగా కనిపిస్తోంది. జాతీయ స్థాయిలో పోటీ చేయాలన్న ప్రయత్నాలు అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమితో గల్లంతు అయ్యాయి. ఇప్పుడు మజ్లిస్ కు కాంగ్రెస్ తో సన్నిహితంగా ఉండటమే కీలకం. అసెంబ్లీ ఎన్నికల్లో మజ్లిస్ ప్రచారం చేసినా ముస్లిం వర్గాలు బీఆర్ఎస్ వైపు కాకుండా కాంగ్రెస్ వైపు మొగ్గారని ఓటింగ్ సరళిని బట్టి అర్థమవుతుంది. అదిగాక బీజేపీకి వ్యతిరేకంగా జాతీయ స్థాయిలో కాంగ్రెస్ పోరాడుతుంది. ఇండియా కూటమిని ముందుండి నడిపిస్తుంది. జాతీయ రాజకీయాలు బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ, కాంగ్రెస్ సారధ్యంలోని ఇండియా కూటమిలు అన్నట్లుగా సాగుతున్నాయి. ఈ క్రమంలో రాష్ట్రంలో బీఆరెస్, ఎంఐఎంలు ఏదో ఒక పక్షంకు ఎన్నికల ముందు లేదా తర్వాతా మద్దతునివ్వక తప్పని పరిస్థితి తలెత్తవచ్చు. లోక్‌సభ ఎన్నికల్లోనూ కాంగ్రెస్, బీజేపీ, బీఆరెస్‌ల మధ్య రాష్ట్రంలో త్రిముఖ పోటీ సాగనుంది. ఇంకోవైపు బీజేపీ, బీఆరెస్‌లు లోపాయి అవగాహనకు రావచ్చన్న ప్రచారం కూడా వినిపిస్తున్నది. తెలంగాణలో అధికార పార్టీగా కాంగ్రెస్ మెజార్టీ సీట్లు గెలుచుకుని అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపు గాలి వాటం కాదని చాటల్సిన అవసరముంది. ఇటు రాష్ట్రంలోనూ, అటు జాతీయ స్థాయిలోనూ కాంగ్రెస్ విజయానికి మైనార్టీ ఓటర్ల అండ కూడా అవసరమే. ఎంఐఎంకు కూడా బీజేపీ ఓటమే ప్రధాన లక్ష్యమంటుంది. అందుకు పరస్పర రాజకీయ ప్రయోజనాల నేపధ్యంలో కాంగ్రెస్, ఎంఐఎంలు భవిష్యత్తు రాజకీయాల్లో కలిసి సాగాలన్న ఆలోచనకు రావచ్చని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో రేవంత్, అక్బరుద్ధీన్‌ల భేటీ జరిగి ఉండవచ్చని, రానున్న లోక్ సభ ఎన్నికల్లో ఆ రెండు పార్టీలు కలిసి సాగినా ఆశ్చర్యం లేదన్న ప్రచారం సాగుతున్నది. అయితే మజ్లిస్ ఎప్పుడూ ఏ కూటమిలో నేరుగా చేరదు.. తెర వెనుక సహకారంకు మాత్రమే పరిమిత మవుతుంది. సీఎం రేవంత్ రెడ్డి, ఎంఐఎం శాసన సభ పక్ష నేత అక్బరుద్ధీన్ ఒవైసీలు లండన్ నగరంలో పర్యటించారు. లండన్ షార్డ్ ను సందర్శించారు. అక్కడ నుండి లండన్ అర్బన్ లేఔట్, అభివృద్ధిని ఏరియల్ వ్యూ ద్వారా పరిశీలించారు. 72 అంతస్తుల పైభాగంలో, 309 మీటర్ల పొడవు ఎత్తు నుండి , నిండుగా ఉన్న థేమ్స్ నది లండన్ ఉత్తరం వైపు ప్రాచీన నగరంతో ఆధునిక పశ్చిమ భాగాన్ని ఎలా కలుపుతుందో పరిశీలించారు. హైదరాబాద్ నగర అభివృద్ధి, మూసీ రివర్ అభివృద్ధి చర్యల కోణంలోనే ఈ పరిశీలన చేశారు. అయితే దీని

# ఈనెల 25న జాతీయ ఓటరు దినోత్సవం

## అదేరోజు జెఎన్‌టియులో అవగాహన సదస్సు

## ముఖ్య అతిథిగా రాష్ట్ర గవర్నర్ తమిళిసై హాజరు

## రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ వెల్లడి

హైదరాబాద్,జనవరి20(మరో ఉదయం)

రాష్ట్రంలో ఈనెల 25 వ తేదీన జాతీయ ఓటర్ల దినోత్సవం జరపడానికి తగిన ఏర్పాట్లు చేయాలని అన్ని రాష్ట్రాల, కేంద్రపాలిత ప్రాంతాల ప్రధాన కార్యదర్శులను, రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారులను, జిల్లాల ఎన్నికల అధికారులను కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. 14 వ జాతీయ ఓటర్ల దినోత్సవాలకు -ఓటింగ్‌కు మించినదేదీ లేదు, నేను తప్పక ఓటేస్తాను అనే అంశాన్ని ఎంపిక చేశారు. కూకట్‌పల్లి జెన్‌టియు ఆడి టోరియంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న ఈకార్యక్రమానికి గవర్నర్ ముఖ్య అతిథిగా హాజరైతారని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ తెలిపారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఈ కార్యక్రమాల్లో విద్యాసంస్థలు మొదలైనవాటిని కూడా భాగస్వాములను చేయాలని, ఉదయం 11 గంటలకు రాష్ట్ర స్థాయిలో ఎన్నికల ప్రతిజ్ఞ తీసుకునేలా ఏర్పాటు చేయాలని ప్రధాన కార్యదర్శులకు రాసిన లేఖలో కేంద్ర ఎన్నికల సంఘం సూచించింది. బూత్ స్థాయి నుంచి రాష్ట్రవ్యాప్తంగా జాతీయ ఓటరు దినోత్సవాలను నిర్వహించాలని డీఈఓలతో సహా సంబంధిత అధికారులందరికి రాష్ట్ర అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎన్నికల సంఘం కార్యక్రమాలపై ఓటర్లకు అవగాహన కల్పించేందుకు ఆయన ఈ మేరకు మార్గదర్శకాలను జారీ చేశారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఓటర్లకు విజ్ఞప్తి చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో విద్యాలయాల్లో డిబేట్లు, డ్రాయింగ్‌లు మొదలైన వాటిలో పోటీలు, అన్ని బహిరంగ ప్రదేశాలలో పోస్టర్లు, బ్యానర్‌లను ప్రదర్శించడం, సెమినార్లు, వెబ్‌నార్లు, ప్రకటనలు, ప్రచారాలు మొదలైన వాటిని నిర్వహించడం వంటివి చేపట్లనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమాల నిర్వహణలో పోస్టల్, రైల్వేలు, పంచాయత్ రాజ్ సంస్థల వంటి ప్రభుత్వ సంస్థలను, సామాజిక సేవా సంస్థలు, ఇతర ప్రజాసంఘాలను కూడా నిమగ్నం చేయాలని సూచించారు. బూత్ లెవల్ అధికారి స్థాయిలో కొత్త ఓటర్లను సత్కరించి, వారికి కొత్త ఓటర్ ఎపిక్ కార్డులు జారీ చేయాలని, ఈ కార్యక్రమాలకు వీలైనంత ఎక్కువ ప్రచారం కల్పించాలన్నారు. పోస్టల్ బ్యాలెట్, పోలింగ్ స్టేషన్లలో కనీస సౌకర్యాలు, ఈవీఎంలు, వీవీప్యాట్‌లు, నైతిక ఓటింగ్, ఓటరు హెల్ప్‌లైన్ యాప్‌లవంటి వాటికి స్థానిక భాషల్లో ప్రచారం కల్పించడానికి సమాచారాన్ని సృజనాత్మకంగా అభివృద్ధి చేయాలనీ, వాట్సాప్ గ్రూపులు, ఇతర సోషల్ మీడియా వేదికల ద్వారా వాటిని ప్రచారం చేయాలన్నారు. ఈ కార్యక్రమాల అమలుకు పోలింగ్ కేంద్రాల వద్ద అవసరమైన ఏర్పాట్లు చేయాలని డీ ఈవోలందరినీ ఆదేశించారు. ఈసమావేశంలో అదనపు సిఇఓ లోకేష్ కుమార్, సర్ఫరాజ్ అహ్మద్, రోనాల్ రోస్, కలెక్టర్లు అనుదీప్, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

# రైతుకూలీల డిమాండ్లపై రైతుల ఆందోళన

## కూలీరేట్లు తగ్గించాని కోరుతూ నిరసన

## సూర్యాపేట జిల్లాలో వింత అనుభవం

సూర్యాపేట,జనవరి20(మరో ఉదయం):

వ్యవసాయ కూలీల డిమాండ్లపై రైతులు ఆందోళనకు దిగారు. కూలీరేట్లు తగ్గించుకోవాలని డిమాండ్ చేశారు. కూలీ రేట్ల తగ్గించాలని డిమాండ్ చేస్తూ.. రైతులు ధర్నాకు దిగిన వింత పరిస్థితి సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలం దొండపాడులో జరిగింది. శనివారం ఉదయం.. పొలాల్లో పని చేయటానికి వ్యవసాయ కూలీల కోసం వచ్చారు రైతులు. 400 రూపాయలు ఇవ్వాలని కూలీలు డిమాండ్ చేశారు.. దీనిపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒప్పందం ప్రకారం.. 300 రూపాయలే ఇస్తామని.. అంత కంటే ఇవ్వలేం అంటూ రైతుల అడ్డం తిరిగారు. ఈ క్రమంలోనే కొంత మంది రైతులు.. పొలాల్లో పంట కోతకు వచ్చిందని.. కూలీలు లేకపోతే నష్టపోతాం అంటూ కొందరు రైతులు 400 రూపాయలు ఇవ్వటానికి సిద్ధం అయ్యారు. అయితే ధర్నా చేస్తున్న రైతులు అడ్డుకున్నారు. ఇవాళ అవసరం కదా అని 400 రూపాయలు మీరు ఇస్తున్నారు.. అదే రేటు అందర్నీ ఇవ్వమంటారు.. రేపు 500 రూపాయలు అడుగుతారు.. అప్పుడు ఏం చేస్తారంటూ కొందరు రైతులు వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలోనే రైతుల మధ్య వాగ్వాదం జరిగింది. వ్యవసాయ పనులు ప్రారంభం అయినప్పుడు ఒప్పందం ప్రకారం 300 రూపాయలు అని నిర్ణయించారని.. ఇప్పుడు 100 రూపాయలు ఎలా పెంచుతారంటూ గ్రామంలోని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే సమయంలో వ్యవసాయ కూలీలు, రైతుల మధ్య వాగ్వాదం, తోపులాట జరిగింది. అన్ని ఖర్చులు పెరిగాయి 400 రూపాయలు ఇస్తేనే వస్తామని వ్యవసాయ కూలీలు.. లేదు 300 రూపాయలు మాత్రమే ఇస్తామని రైతులు పంతాలకు పోయారు. గ్రామంలోని రోడ్డుపై ధర్నాకు దిగారు రైతులు. కూలీ రేట్లు తగ్గించాలని.. 400 రూపాయలు ఇచ్చేది లేదని.. 300 రూపాయలు మాత్రమే ఇస్తామని.. మిగతా రైతులు అందరూ ఈ నిర్ణయానికి కట్టుబడాలని పిలుపునిచ్చారు.. మొత్తానికి గ్రామంలో కూలీలు, రైతుల మధ్య కూలీ రేట్ల విషయంలో వివాదం ఎంత దూరం వెళుతుందో చూడాలి...

# కృష్ణ ధర్మపరిషత్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠా మహోత్సవ్

## హైదరాబాద్‌లో నెక్లెస్ రోడ్డులో 22న నిర్వహణ


హైదరాబాద్,జనవరి20(మరో ఉదయం):

యావత్ ప్రపంచం అయోధ్య వైపు చూస్తోంది. హిందూ ప్రపంచం పండుగగా భావిస్తున్న అయోధ్య శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాన్ని భాగ్యనగరం నడిబొడ్డన చరిత్రలో నిలిచిపోయేలా నిర్వహించేందుకు కృష్ణ ధర్మపరిషత్ (ఆల్ ఇండియా) నిర్ణయించింది. పరిషత్ అధ్యక్షులు అభిషేక్ గౌడ్, కార్యదర్శి సాయిరామ్ యాదవ్, ఉపాధ్యక్షులు అనిష్ గౌడ్, కృష్ణ ధర్మ పరిషత్ ప్రధాన కార్యదర్శి శివారెడ్డి ,కార్యదర్శి అశోక్ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. కార్యక్రమ వివరాలను పరిషత్ అధ్యక్షులు అభిషేక్ గౌడ్ వివరించారు. హిందూ ఐక్యత చాటేలా.. హైదరాబాద్ వేదికగా ప్రతిష్ఠాత్మక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. కృష్ణ ధర్మపరిషత్ ఆధ్వర్యంలో ఈ నెల 22న హైదరాబాద్ న్లకెస్ రోడ్ లో అంబేద్కర్ విగ్రహాం పక్కన, ప్రసాద్ మల్టీప్లెక్స్ సమీపంలో భారీ కార్యక్రమానికి నిర్ణయించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ ఓబీసీ మోర్చా అధ్యక్షులు, బీజేపీ పార్లమెంటరీ పార్టీ నేత, రాజ్యసభ సభ్యులు డాక్టర్ కే లక్ష్మణ్ ముఖ్య అతిధిగా హాజరు కానున్నారు. 22న మధ్నాహ్నం 4 గంటల నుంచి కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయి. శ్రీరామ్ పూజతో కార్యక్రమానికి అంకురార్పణ చేయనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో భాగంగా భారీగా తరలి వస్తున్న భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని అభిషేక్ గౌడ్ వివరించారు. భక్తులను పూర్తిగా ఆధ్యాత్మిక వాతావరణంలో నిలిచిపోయేలా గణెళిష్, శ్రీరామ్, హనుమాన్ కీర్తనలు, పాటలతో భక్తిలహరి ఏర్పాటు చేసామని పేర్కొన్నారు.

# బియ్యం గింజలతో అయోధ్య నమూనా

## గిన్నెస్ రికార్డ్ హోల్డర్, డాక్టర్ గుర్రం దయాకర్ ప్రతిభ

హైదరాబాద్,జనవరి20(మరో ఉదయం):



ఈ నెల 22న అయోధ్య రామ మందిరంలో శ్రీరాముడి ప్రాణప్రతిష్ఠ జరగనున్న నేపథ్యంలో స్వర్ణకారులు, సూక్ష్మ కళాకారులు, నేత కార్మికులు తదితరులు తమతమ కళా నైపుణ్యాలను ప్రదర్శిస్తున్నారు. శ్రీరాముడు, సీతాదేవి, అయోధ్య రామాలయం ఇలా తమకు తోచిన నమూనాలను రూపొందిస్తూ రామయ్యపై భక్తిని చాటుకుంటున్నారు. తాజాగా ప్రముఖ సూక్ష్మ కళాకారుడు, గిన్నెస్ రికార్డ్ హోల్డర్, డాక్టర్ గుర్రం దయాకర్ బియ్యం గింజలతో అయోధ్య రామాలయ నమూనాను రూపొందించారు. ఈ రామాలయ నమూనా రూపకల్పన కోసం డాక్టర్ దయాకర్ ఏకంగా 16 వేలకు పైగా బియ్యపు గింజలను వినియోగించారు. ఈ కళాఖండాన్ని దయాకర్ దేశ ప్రధాని నరేంద్ర మోదీకి అందజేయనున్నారు. ఈ కళాఖండం రూపకల్పనపై ఆయన మాట్లాడుతూ.. 'ప్రధాని మోదీ అకుంఠిత దీక్షవల్లనే ఇప్పుడు రామాలయ నిర్మాణం జరిగింది. ఇది భారతదేశానికి గర్వకారణం. సనాతన ధర్మం గొప్పతనం. ఈ సందర్భంగా ఒక సూక్ష్మ కళాకారుడిగా, రామ భక్తునిగా ఈ కళాఖండాన్ని రూపొందిం చాను అని తెలిపారు. 16 వేలకు పైగా బియ్యపు గింజలతో రూపొందించిన ఈ కళాఖండాన్ని ప్రధాని మోదీకి అందజేస్తా. ఈ కళాఖండాన్ని తయారు చేయడానికి 60 గంటల సమయం పట్టింది. ఇంత అద్భుతమైన కళాఖండాన్ని ఇప్పటివరకు ప్రపంచంలో ఎవరు తయారు చేయలేదు. ఈ కళాఖండాన్ని రూపొందించడం నా అదృష్టంగా భావిస్తున్నా' అని డాక్టర్ దయాకర్ చెప్పారు.

# స్వర్ణకారుడు కపిలవాయి గోపి చారి ప్రతిభ

## గోరంత సైజులో ఆయోధ్య రామాలయం నమూనా

నాగర్‌కర్నూలు,జనవరి20(మరో ఉదయం): అయోధ్య రామాలయంలో మరో రెండు రోజుల్లో అంటే ఈ నెల 22న శ్రీరాముడి ప్రాణప్రతిష్ఠ జరుగనుంది. ఈ కార్యక్రమాన్ని అంగరంగవైభవంగా నిర్వహించేందుకు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. అయితే శ్రీరాముడి ప్రాణప్రతిష్ఠ నేపథ్యంలో జనం ఎవరికి తోచిన రీతిలో వారు తమ భక్తిని చాటుకుంటున్నారు. శ్రీరాముడి పేరు మీద ఓ టాటూ ఆర్టిస్ట్ భక్తులకు ఉచితంగా టాటూలు వేస్తున్నాడు. ఓ ట్రస్ట్ వాళ్లు రామయ్య కోసం 12 లక్షల మంది నేసిన ప్రత్యేక వస్త్రాలను శ్రీరామ తీర్థ క్షేత్ర ట్రస్టు వారికి అందజేశారు. కొందరు లడ్డూలు చేసి పంపుతున్నారు. మరికొందరు రాముడు, సీత, అయోధ్య ఆలయ నమూనాలతో ఆభరణాలను తయారు చేసి భక్తిని చాటుకుంటున్నారు. తాజాగా తెలంగాణ నుంచి నాగర్‌కర్నూలు జిల్లా అమ్రాబాద్ మండలానికి చెందిన స్వర్ణకారుడు కపిలవాయి గోపి చారి కూడా రామయ్యపై భక్తితో తన స్వర్ణ కళా నైపుణ్యాన్ని ప్రదర్శించాడు. కేవలం 2.73 మిల్లిగ్రాముల బంగారంతో గోరంత సైజులో ఆయోధ్య రామాలయం నమూనాను రూపొందించాడు. గోపి చారి రూపొందించిన ఈ అయోధ్య నమూనా 1.5 సెంటీ మీటర్ల ఎత్తు, 1.75 సెంటీ మీటర్ల వెడల్పు, 2.75 సెంటీ మీటర్ల పొడవుతో ఉంది. ఈయన గతంలో కూడా బంగారంతో ఃట్వంటీ వరల్డ్‌కప్ నమూనాను తయారు చేశాడు. భవిష్యత్‌లో కూడా ఇలాంటి సూక్ష్మ నమూనాలను తయారు చేస్తానని చెబుతున్నాడు. గ్రామానికి చెందిన స్వర్ణకారులు గోపిని సన్మానించారు.




# అమరావతి నుంచి కుంకుమ పత్రాలు

నాసిక్,జనవరి20(మరో ఉదయం):

రామమందిర విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం కోసం మహారాష్ట్రలోని అమరావతి నుంచి అయోధ్యకు 300 కిలోల కుంకుమ పత్రాలను పంపిస్తున్నారు. ఆధ్యాత్మిక గురువులు రాజేశ్వర్ మౌళి, జితేంద్రనాథ్ మహరాజ్‌లు ఈ పత్రాలను అయోధ్యకు తీసుకెళుతున్నారు. వారు అయోధ్యకు బయలుదేరడాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన కార్యక్రమానికి స్థానిక ఎంపి నవనీత్ రాణా హాజరయ్యారు. భారత దేశంలో కుంకుమ పత్రాలకు సామాజిక,మతపరమైన ప్రాధాన్యత ఎంతో ఉంది.

# అయోధ్యకు ఉజ్జయిని లడ్డూలు

## ట్రక్కులకు జెండా

## ఊపిని సిఎం యాదవ్

భోపాల్,జనవరి20(మరో ఉదయం):

అయోధ్యలో రామమందిర ప్రతిష్ఠాపన కార్యక్రమం కోసం ఉజ్జయిని మహాకాళేశ్వర్ అలయంతో తయారు చేసిన 5 లక్షల లడ్డూలు అక్కడికి బయలుదేరాయి. ఈ లడ్డూలు తీసుకుని బయలు దేరిన అయిదు ట్రక్కులకు మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ జెండా ఊపి ప్రారంభించారు. ఒక్కోటి 50 గ్రాముల బరువుండే ఈ లడ్డూలు మొత్తం 250 క్వింటాళ్ల బరువుంటాయని మహాకాళేశ్వర ఆలయ అధికారి ఒకరు చెప్పారు. అంతకు ముందు ఉజ్జయినుంచి ఈ లడ్డూలను తీసుకుని వచ్చిన అయిదు ట్రక్కులు భోపాల్‌కు చేరుకున్నాయి. అయిదు రోజుల పాటు 150 మంది ఆలయ సిబ్బందితో పాటుగా స్థానిక స్వచ్ఛంద సంస్థలకు చెందిన పలువురు ఈ లడ్డూల తయారీలో పాలు పంచుకున్నట్లు మహాకాళ్వేర్ ఆలయ అధికారి మూల్‌చంద్ జున్వాల్ చెప్పారు. ఆలయానికి ప్రత్యేక విభాగం ఈ లడ్డూలను తయారు చేసినట్లు ఆయన చెప్పారు.

# 22న శ్రీరామానుజ సర్కిల్ వద్ద అన్నదానం

హైదరాబాద్,జనవరి20(మరో ఉదయం)

అయోధ్యలో నవ నిర్మిత భవ్య మందిరంలో 22 సోమవారం నాటి అభిజిత్ లగ్నంలో శ్రీరాంలాలా విగ్రహ ప్రతిష్ఠామహోత్సవ సుముహూర్తం.. సందర్భంగా మౌలాలి శ్రీరంగగిరి గోదాట్రస్ట్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అభిషేకాలు, పూజలు, అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. రామచద్రుడి ఆరాధ్య దైవం శ్రీరంగ నాథుడు. ఆ స్వామి మహత్తును జగత్తుకు చాటిన జగదాచార్యులు భగవద్రామానుజులు. వీరి పేరిట వెలసిన మన రామానుజ సర్కిల్లో వేయిమందికి ఆరోజు స్వామికి నివేదించిన అన్నప్రసాదాన్ని వితరణ చేయడానికి పూను కున్నట్లు తెలిపారు. ఈ మహా అన్నదాన కార్యక్రమానికి ముందు ఉదయం అక్కడే ఉన్న బృహ దాంజనేయ సన్నిధిలో శ్రీ సీతారామ సమేత ఆంజ నేయుడికి విశేష ఆరాధన, మన్యు సూక్తపూర్వక అభిషేకం, శ్రీమద్రా మాయ ణాంతర్గతమైన శ్రీరామజననం, పట్టాభిషేక సర్గల పారాయణం, హనుమాన్ చాలీసా సామూహిక గానం, హారతి తదితర విశేష కైంకర్యాలు వుంటాయని తెలిపారు.

# 22న పుదుచ్చేరిలో సెలవు ప్రకటన

పుదుచ్చేరి,జనవరి20(మరో ఉదయం):

అయోధ్యలో రాముడి విగ్రహ ప్రాణప్రతిష్ట మహోత్సవం సందర్భంగా ఈ నెల 22న పుదుచ్చేరికి సెలవు ప్రకటిస్తూ సీఎం ఎన్.రంగస్వామి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు సోమవారం కేంద్రప్రభుత్వ కార్యాలయాలకు మధ్యాహ్నం 2.30 గంటల వరకు సెలవు ప్రకటించింది. అలాగే, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర తదితర బీజేపీ నేతృత్వంలోని రాష్ట్రప్రభుత్వాలు 22వ తేది సెలవురోజుగా ప్రకటించాయి. ఈ నేపథ్యంలో, సీఎం కూడా రాముడి విగ్రహ ప్రాణప్రతిష్ట కార్యక్రమాన్ని టీవీ ఛానళ్లలో వీక్షించేలా రాష్ట్రప్రజలకు అవకాశం కల్పిసూ సెలవు దినంగా ప్రకటించారు.

మరో ఉదయం

# సినిమా వార్తలు

## విజయ్ సరసన తృప్తి ద్రిమి ?



లైగర్ డిజాస్టర్ తర్వాత రౌడీ హీరో విజయ్ దేవరకొండ ఓ సాలిడ్ సక్సెస్ కోసం ఎంతగానో ప్రయత్నిస్తున్నాడు. గత ఏడాది వచ్చిన 'ఖుషి' ఆ రేంజ్ సక్సెస్ ని అందించలేక పోయింది. ఫ్యామిలీ లవ్ ఎంట్టంల్గ÷నర్ గా రూపొందిన ఈ చిత్రం బాక్స్ ఆఫీస్ వద్ద ఫరవాలేదనిపించింది. కానీ రౌడీ హీరో నుండి ఫ్యాన్స్ మాత్రం బ్లాక్ బస్టర్ ఆశిస్తున్నారు. అందుకే ఈసారి పవర్ఫుల్ పోలీస్ పాత్రతో ప్రేక్షకులు ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్నాడు. విజయ్ దేవరకొండ ప్రస్తుతం రెండు సినిమాలకు కమిట్ అయ్యాడు. అందులో జెర్సీ మూవీ ఫేమ్ గౌతమ్ తిన్ననూరి ప్రాజెక్ట్ ఒకటి. ఇందులో విజయ్ దేవరకొండ కానిస్టేబుల్ పాత్రలో కనిపించనున్నాడు. ఇక ఈ సినిమాలో విజయ్ దేవరకొండ సరసన శ్రీ లీలను హీరోయిన్గా తీసుకున్నారు. ఎప్పుడో మొదలవ్వాల్సిన ఈ మూవీ షూటింగ్ శ్రీ లీల వల్లే ఆలస్యం అయ్యింది. శ్రీలీలా వరుస సినిమా షూటింగ్స్ తో బిజీగా ఉండడంతో ఈ ప్రాజెక్టు కోసం డేట్స్ కేటాయించలేకపోయింది. దాంతో ఈ ప్రాజెక్టు సెట్స్ పైకి వెళ్లకుండా వాయిదా పడుతూ వచ్చింది. ఈ క్రమంలోనే విజయ్ దేవరకొండ సినిమా నుంచి శ్రీలీల తప్పుకుందని, తన ప్లేస్‌లో రష్మిక మందనని తీసుకున్నారని ఆ మధ్య వార్తలు వచ్చాయి. కానీ అందులో ఎలాంటి వాస్తవం లేదని మూవీ టీం క్లారిటీ ఇచ్చింది. ఇదిలా ఉంటే ఇప్పుడు ఈ ప్రాజెక్టు నుంచి నిజంగానే శ్రీలీలా తప్పు కున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఆమె స్థానంలో యానిమల్ మూవీలో సెకండ్ హీరోయిన్ గా నటించిన బాలీవుడ్ బ్యూటీ తృప్తి ద్రిమి తో పాటూ 'సప్త సాగరాలు దాటి' హీరోయిన్ రుక్మిణి వసంత్ లను మూవీ టీం పరి శీలి స్తున్నట్లు తెలుస్తోంది. యానిమల్ మూవీలో కనిపించింది కాసేపే ఆయన తన గ్లామర్ ట్రీట్ తో కుర్రకారును విపరీతంగా ఆకట్టుకుంది తృప్తి ద్రిమి. ఈ సినిమా తర్వాత సోషల్ మీడియాలో నేషనల్ క్రష్ గా మారిన ఈ ముద్దుగుమ్మని ఇప్పుడు హీరోయిన్ గా తీసుకునే ఆలోచనలో మేకర్స్ ఉన్నట్లు తెలుస్తోంది. ఈమెతో పాటు 'సప్త సాగరాలు దాటి' సినిమాలో తన న్యాచురల్ యాక్టింగ్ తో ఆకట్టుకున్న రుక్మిణి వసంత్ ను కూడా మరో ఆప్షన్ గా పెట్టుకున్నారట. మరి ఈ ఇద్దరిలో విజయ్ దేవరకొండ సరసన ఎవరు నటిస్తారనేది త్వరలోనే తెలియనుంది. కాగా మార్చిలో ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ మొదలుకానున్నట్లు సమాచారం. ఇక ప్రస్తుతం విజయ్ దేవరకొండ పరశురామ్ దర్శకత్వంలో నటిస్తున్న 'ఫ్యామిలీ స్టార్' షూటింగ్ చివరి దశలో ఉంది. గీత గోవిందం వంటి బ్లాక్ బస్టర్ తర్వాత వీరి కాంబోలో వస్తున్న సినిమా కావడంతో ఈ చిత్రంపై భారీ అంచనా నెలకొన్నాయి. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్ పై దిల్ రాజు నిర్మిస్తున్న ఈ చిత్రం మార్చిలో ప్రేక్షకుల ముందుకు రానుంది.

## అందాల ఆరబోతలో కృతిసనన్



హిందీ పరిశ్రమలో ఇప్పుడు అగ్ర నటీమణుల్లో వున్న కృతి సనన్ అందాల ఆరబోతలో ముందున్నది. తన అందచందాలతో కుర్రాకరును పిచ్చెక్కిస్తోంది. మొదటి సినిమా తెలుగు సూపర్ స్టార్ మహేష్ బాబు పక్కన '1: నేనొక్కడినే' సినిమాలో కథానాయికగా నటించింది. కృతి సనన్ ఆ తరువాత మరొక్క తెలుగు సినిమా మాత్రమే చేసింది. తరువాత హిందీ పరిశ్రమకి వెళ్ళిపోయింది.గత సంవత్సరం కృతి సనన్ హిందీ సినిమాలు మూడు విడుదలయ్యాయి. అందులో అల్లు అర్జున్, త్రివిక్రమ్ కాంబినేషన్ లో వచ్చిన 'అల వైకుంఠపురంలో' సినిమాని హిందీలో 'షెహ జాద' అనే పేరు మీద రీమేక్ చేశారు. ఇందులో కార్తీక్ ఆర్యన్ కథానాయకుడు. ఈ సినిమా బాక్స్ ఆఫీస్ దగ్గర నడవలేదు. తరువాత తెలుగు నటుడు ప్రభాస్ తో పాన్ ఇండియన్ సినిమాగా 'ఆదిపురుష్' లో సీతామాతగా కృతి సనన్ చేసింది. కానీ ఈ సినిమాకి వచ్చినన్ని విమర్శలు ఇంకే సినిమాకీ రాలేదేమో అనిపిస్తుంది. తరువాత 'గణపత్' అని ఇంకో సినిమా విడుదలైంది. టైగర్ ష్రాఫ్ ఈ సినిమాలో రెండు పాత్రల్లో కనపడితే, కృతి సనన్ కథానాయికగా నటించింది. ఇందులో లెజెండరీ నటుడు అమితాబ్ బచ్చన్ ఒక ప్రత్యేక పాత్రలో కనిపిస్తారు. అయినా ఈ సినిమా కూడా బాక్స్ ఆఫీస్ దగ్గర చతికల బడింది. కానీ సంతోషకరమైన వార్త ఏంటంటే, గత సంవత్సరం జాతీయ అవార్డు అందుకున్న వాళ్లలో కృతి సనన్ కూడా వుంది. 'మిమి' సినిమాలో ఆమె చేసిన పాత్రకి గాను ఉత్తమ నటిగా కృతి సనన్ ఈ జాతీయ అవార్టు అందుకుంది. ఈ సంవత్సరం కృతి సనన్ సినిమా 'తెరి బాతొన్ మె ఐసా ఉజా జియా' వచ్చేనెల అంటే ఫిబ్రవరి 9న విడుదలవుతోంది. షాహిద్ కపూర్ కథానాయకుడు, ఇందులో కృతి సనన్ ఒక రోబోట్ గా కనిపించనుంది. ఈ సినిమా ట్రైలర్, పాటలు చూస్తే ఆమె రోబోట్ గా చేసింది అని అర్థం అవుతోంది. ఈ సినిమా ప్రచారాలు మొదలుపెట్టేసింది కృతి సనన్. ఆ సందర్భంగా తీసిన ఫోటోలు ఇప్పుడు వైరల్ అయ్యాయి. ఈ సినిమా అయినా విజయం సాధిస్తుందని, కృతి సనన్ ఈ సంవత్సరం విజయంతో మొదలు పెడుతుందని ఆమె అభిమానులు ఎదురు చూస్తున్నారు.

## నాని సినిమా డిస్ట్రిబ్యూషన్ హక్కులు పొందిన దిల్ రాజు

నాని నటిస్తున్న 'సరిపోదా శనివారం' షూటింగ్ జరుగుతోంది. వివేక్ ఆత్రేయ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో ప్రియాంక మోహన్ కథానాయికగా నటిస్తోంది. ఇందులో ప్రముఖ తమిళ నటుడు ఎస్ జె సూర్య విలన్ పాత్రలో కనపడతారు. డీవీవీ దానయ్య దీనికి నిర్మాత. శనివారంనాడు ఈ సినిమా గురించి ఒక ముఖ్యమైన వార్త ఈరోజు విడుదల చేశారు. ప్రముఖ నిర్మాత దిల్ రాజు, అతని సోదరుడు శిరీష్ నిర్మాణ సంస్థ అయిన శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ ఈ 'సరిపోదా శనివారం' సినిమా ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల డిస్టిబ్యూషన్ హక్కులు తీసుకున్నట్టుగా సామజిక మాధ్యమం వేదికగా ప్రకటించింది. శనివారం కావటంతో ఈ సినిమా టైటిల్ కూడా అలాగే ఉండటంతో ఈరోజు ఈ ప్రకటన రావటం ఆసక్తికరం. ఇలా సినిమా నిర్మాణంలో ఉండగానే థియేటర్ హక్కులు కొనుక్కోవటం పరిశ్రమలో ఒక చర్చగా నడుస్తోంది. ఈ సినిమా మీద ఇప్పటికే క్రేజ్ ఉన్నప్పటికీ, దిల్ రాజు ఇలా థియేటర్ హక్కులు తీసుకోవటంతో మరింత ఆసక్తికరం పెరిగింది అని అంటున్నారు. ఇది ఒక యాక్షన్ సినిమాగా తెరకెక్కనుంది అని కూడా తెలుస్తోంది.



## పెళ్లి చేసుకోబోతున్న సొనారికా

సొనారిక భడోరియా 'మహాదేవ్' అనే పౌరాణిక సీరియల్ లో శివుడు భార్య పార్వతి పాత్రలో కనిపించి టీవీ ప్రేక్షకులకు ఎంతో సుపరిచితం అయింది. ప్రతి ఇంట్లోనూ ఆమె పేరు తెలియని వారుండరు అంటే అతిశయోక్తి కాదు, ఎందుకంటే ఆ పౌరాణిక సీరియల్ అంతగా విజయం సాధించింది. ఆ తరువాత సొనారిక తెలుగు సినిమా ప్రేక్షకులకి కూడా పరిచయం అయింది. మంచు విష్ణు, రాజ్ తరుణ్ నటించిన 'ఈడో రకం ఆడో రకం' సినిమాలో సొనారిక ఒక కథానాయకురాలిగా నటించింది. అంతకు ముందు నాగ శౌర్య కథానాయకుడిగా నటించిన 'జాదూగాడు' సినిమాతో కథానాయకురాలిగా తెలుగు తెరకి పరిచయం అయింది. బెల్లంకొండ శ్రీనివాస్ కథానాయకుడిగా నటించిన 'స్పీడున్నోడు' సినిమాలో కూడా కథానాయకు రాలిగా నటించింది. కానీ ఆ తరువాత ఎందుకో ఆమెకి తెలుగులో అంతగా అవకాశాలు రాలేదు, మళ్ళీ ముంబై వెళ్ళిపోయింది. 2022లో సోనారిక తన ప్రియుడు, వ్యాపారవేత్త అయిన వికాస్ తో నిశ్చితార్థం చేసుకుంది, కానీ వివాహం ఎప్పుడు చేసుకుంటుంది అనే విషయం మాత్రం అప్పుడు చెప్పలేదు. అయితే ఇప్పుడు తాజా సమాచారం ప్రకారం, ఆమె తన వివాహం ఫిబ్రవరి 18న చేసుకోబోతున్నట్టుగా తెలుస్తోంది. అప్పుడెప్పుడో నిశ్చితార్థం చేసుకున్న సోనారిక పెళ్లి ఇప్పుడు చేసుకోవాలని అనుకోవడం ఆసక్తికరం. అయితే వాళ్ళిద్దరి సామాజిక మాధ్యమాల్లో ఈ ఇద్దరూ కలిసి వున్న ఫోటోలు చాలానే పోస్ట్ చేస్తున్నారు. కుటుంబ సభ్యులు కోరిక మేరకి ఈ ఇద్దరూ ఇక వివాహం బంధంలోకి అడుగుపెట్టాలని భావించినట్టుగా తెలుస్తోంది. అందుకే ఫిబ్రవరిలో పెళ్లి ముహూర్తం ఖరారు చేసుకున్నట్టుగా తెలుస్తోంది. ఫిబ్రవరి 18న రాజస్తాన్‌లో ఈ వివాహం జరగనుందని, దీనికి దగ్గర బంధుమిత్రులు, సన్నిహితులు మాత్రమే హాజరువతారని సమాచారం. రాజస్తాన్ లోని రణతంబోర్‌లోని సవాయ్ మాధోపూర్‌లో ఘనంగా వీరి వివాహ వేడుక జరగనుందని అంటున్నారు. అధికారికంగా మాత్రం సమాచారం ఇవ్వాల్సి ఉందని తెలుస్తోంది. 2022 మే 19న తనకు కాబోయే భర్త వికాస్ తన చేతికి రింగ్ తొడిగిన ఫొటోలను తన ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకుంది.ఆ పోస్ట్‌లో అతడికి బర్త్‌డే విషెస్ చెబుతూ తనకు కాబోయే భర్త అని ఆమె అనటం విశేషం. వీళ్లిద్దరూ చాలాకాలం పాటు డేటింగ్ లో వున్నారని వీరిద్దరి సన్నిహితులు చెపుతూ వుంటారు.



Edited,printed,published and Owned by sredharKancham publication.D no.9/20a,main road.yadiki.515408, anantapuram.dist,RNI.Regn.no.Tel tel/2012/40975Email.maroudayamap@gmail.com